

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**ప్రజాశక్తి -కందుకూరు**: మండలంలోని పందలపాడు గ్రామంలో జాషువా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నమెంటును కందుకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, పందలపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రతినిధి కూసం శింగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మ్యాచ్ ప్రారంభం సందర్భంగా పలుకూరు శివాలయం టీం, భీమవరం జగ్జీవన్ టీం క్రికెట్‌కారులను శివరాం కరచాలనం చేసుకొని పరిచయం చేసుకున్నారు. అనంతరం ఇంటూరి నాగేశ్వరరావు యూత్ సభ్యులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి శివరాం మాట్లాడుతూ క్రీడల ద్వారానే యువతలో మంచి పోటీ తత్వం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, నాదెళ్ల వెంకట సుబ్బారావు, దేవదాసు, కూసం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేస్తున్న ఇంటూరి

# రైతులకు శాశ్వత భూ హక్కు కల్పించా...!

- ప్రతి గ్రామంలో భూ సర్వే నిర్వహిస్తున్నాం
- కావలిలో సిఎం వరాల జల్లులు
- జగన్ ప్రసంగంలో వాడీవేడీ

**ప్రజాశక్తి-కావలి**

రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించానని, ఇక నుంచి తమ అవకాశాల కోసం అమ్ముకోవచ్చునని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం కావలి మినీ స్టేడియంలో జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. వందేళ్ల నుంచి ఇబ్బందులు పడుతోన్న రైతులను ఆదుకోడానికి తమ ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 97,471 మంది రైతు కుటుంబాలకు మేలు చేసేలా 2,06,171 ఎకరాల చుక్కల భూములకు సంపూర్ణ భూహక్కు కల్పించామన్నారు. జిల్లాలో 43,270 మంది ఎకరాలు, 23 వేల మంది రైతులకు మేలు జరిగేలా కార్యక్రమం నిర్వహించామన్నారు. ఇప్పటి వరకు ఈ భూములను సాగుచేసుకోవడం తప్ప, మరో ఉపయోగం లేకుండా పోయిం దన్నారు. ఇకపై ఆ భూమి లపై పూర్తి హక్కులు కల్పించా మన్నారు. పిల్లల చదువు, పెళ్లిళ్లు, ఆరోగ్యం సరిగా లేకపోతే ఏ సమస్య వచ్చిన అమ్ముకోడానికి అవకాశం దక్కుతుందన్నారు. తాను ఏం చేసినా ప్రజల కోసమే చేశా న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.06 లక్షల ఎకరాలు 22 ఎ నిషేధిత స్థలాల జాబితా నుంచి తొలగిం చామన్నారు. దీని వల్ల సుమారు 20 వేల కోట్లు రైతులకు లబ్ది చేకూరుతుందన్నారు. తొలిసారిగా రాష్ట్రంలో ఈ కార్యక్రమా నికి శ్రీకారం చుట్టామన్నారు. నేను మీ వాడిని రాష్ట్రంలోని పేద ప్రజల కోసం ఇప్పటి వరకు రూ.2.10 లక్షల కోట్లు బటన్ నొక్కి నేరుగా మీ అకౌంట్‌లో డబ్బులు వేశానని, ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధిచేకూరేలా నేరుగా ఇంటికి నగదు వెళ్లేలా చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.2.10 లక్షల కోట్లు బటన్ నొక్కానన్నారు. మీ బిడ్డగా నేను మీకు సాయం చేసుంటే నాకు మద్దతుగా నిలవాలన్నారు. మళ్లీ ఎన్నికల్లో ప్రజలు పొరపాటు చేస్తే, ప్రస్తుతం వస్తున్న పథకాలు మొత్తం రద్దు చేస్తారన్నారు. ప్రజలు తప్పు చేస్తే నిరు పేదలు రాష్ట్రంలో ఉండే అవకా శాలు ఉండవన్నారు. చంద్ర బాబు నాయుడు మోసపూరిత మాటలతో ప్రజలను లేనిపు ఉన్నట్లు నటిస్తున్నారన్నారు. రాష్ట్రంలో రైతుల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం తనదేనన్నారు. మద్దతు ధర కల్పించడంతోపాటు, నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కేవలం 21 రోజుల సమయంలో నగదు చెల్లించా మన్నారు. చంద్రబాబు దత్తపుత్రుడు, కొన్ని మీడియాలు ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి పనిచేస్తు న్నాయన్నారు. చుక్కల భూముల మాదిరిగానే మరో 30 వేల ఎకరాలు రైతులకు మేలు చేసేలా నిషేధిత జాబితా నుంచి తొలగిస్తున్నామన్నారు. రక రకాల భూములు రికార్డుల్లో లేక ఇబ్బందులు పడుతున్నారని, వందేళ్ల క్రితం భూ సర్వే చేశారని, ఇప్పుడు వివాదాల్లోని భూములకు 17,470 గ్రామాల్లో పూర్తిగా భూ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు వేల గ్రామాలకు సంబంధించి భూ సర్వే చేశామన్నారు. భూ పత్రాలు అందజేశామన్నారు. ఈనెల 20 పత్రాలు అందజేస్తామన్నారు. ప్రతి ఎకరా భూ పత్రాలను అప్‌గ్రేడ్ చేశామన్నారు. ప్రతి గ్రామంలో రైతులకు మంచి జరిగేలా చూస్తున్నా మన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి వైఎస్ఆర్ బీమా, బీమాతో పరిహారం వెంటనే ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా దళారులు, మిల్లర్లతో అవకాశం లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. అనంతరం రైతులకు భూ హక్కుపత్రాలు అందజే శారు. అనంతరం వికలాంగులతో ప్రత్యే కంగా సమావేశం అయ్యారు. వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరి ంచాలని జిల్లా అధికారులను ఆదేశిం చారు. ఈ సమావేశంలో మంత్రులు ధర్మాన ప్రసాద్‌రావు, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపి లు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్‌పి ఛైర్ పర్సన్ ఆనం అరుణమ్మ, ఎంఎల్ ఎసిలు పి.చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి దుర్గాప్రసాద్, మాధవరావు, ఎంఎల్‌ఎలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పి. అనిల్‌కు మార్‌యాదవ్, కలెక్టర్ హరినారా యణ, తదితరులు పాల్గొన్నారు. అం తకు ముందు రైతులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారితో కలిసి ఫొటో దిగారు. రైతుల వరిధాన్యాల మాలతో సిఎంను సన్మానించారు. మధ్యాహ్నం 11 గంటలకు వచ్చిన ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2.19 నిమిషాలకు తిరిగి విజయవాడ పయనమై వెళ్లారు.

ధాన్యంతో చేసిన మాలను వేస్తున్న రైతులు

## టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలి

**ప్రజాశక్తి-కందుకూరు**: గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ఎస్ఎస్ ట్యాంక్ సమీపంలో 1408 మంది పేదలకు ప్రభుత్వం సర్వే చేసి పేదలను గుర్తించి అందజేసిన టిడ్కో గహాలను గత ప్రభుత్వంలో లబ్ధిదారులైన పేదలందరికీ అందజేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి.సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కలపై పురపాలక సంఘం అధికారులు ఈ మధ్యన కొంతమందికి బ్యాంకు రుణాలు రాలేదని రద్దు చేస్తామని నోటీసులు జారీ చేయడం అన్యాయమని అన్నారు. బ్యాంకుల చేత రుణాలు ఇప్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు పేదలకు నోటీసులు జారీ చేయటం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది బ్యాంకర్లు పొదుపు గ్రూపులో లేని లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయమని పేర్కొంటున్న సందర్భంలో పేదల పరిస్థితి ఏమిటో ప్రత్యేక మార్గాలను అన్వేషించాల్సిన అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు లబ్ధిదారులకు త్వరగా ఇల్లు ఇవ్వాలని ఏ ఒక్క పేదవారికి అన్యాయం జరిగిన సిపిఐ ముందుండి ఉద్యమిస్తుందని పేర్కొన్నారు.

## ఉపాధి కూలీలు ఉద్యమించాలి

**ప్రజాశక్తి-వలేటివారిపాలెం**: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని, ఆ పథకంలో పని చేస్తున్న కూలీలందరూ కలిసి ఉద్యమించాలని సిఐటియు నెల్లూరు జిల్లా నాయకులు జివిబి కుమార్ పిలుపునిచ్చారు. నలదలపూరు గ్రామంలో ఉపాధి కూలీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో నిధులు కోత విధిస్తుందని విమర్శించారు. కూలీలకు ముఖహాజరు అమలు చేయాలని చూడటం, ఏప్రిల్, మేలలో ఇచ్చే సమ్మర్ అలవెన్సును రద్దు చేయటం వంటి దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. ప్రతేడాది బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.200 కోట్లు అదనపు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీన నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కూలీలు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో వ్య.కా.సంఘం జిల్లా కమిటీసభ్యులు దువ్వూరు జాన్, కోలా రమణయ్య, మాలకొండయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమార్

# అలరించిన మేడే సాంస్కృతిక ఉత్సవాలు

నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-నెల్లూరు** :స్థానిక జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మహాకవి తిక్కన సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక ఉత్సవాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో ప్రజానాట్యమండలి కళాకారులు ఆలపించిన గీతాలు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. కార్మికుల పండుగ అయిన మేడే దినోత్సవం, కార్మికులు అనేక మంది చేసిన ప్రాణత్యాగాల ఫలితంగా హక్కులను సాధించుకున్న రోజుకు గుర్తుగా సంస్కృతిక కార్యక్రమాలు ఒక ఉత్సవంగా కళాత్మకంగా నిర్వహించాలని, కార్మికుల్లో దాగి ఉన్న కళలను బయటకు తీసుకురావాన్న ఆకాంక్షతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చలంచర్ల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన వంతంగా సాంస్కృతక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నారుల్లో సైన్స్ విజ్ఞానాన్ని పెంపొందించే ప్రయత్నం చేయడం సంతోషకరమన్నారు. సంఘమిత్ర స్కూల్ అధినేత రవీంద్రరెడ్డి మాట్లాడుతూ సమాజంలో నిజం తెలిసినప్పటికీ దానిని కప్పి పుచ్చే ప్రయత్నం చేయడం ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఈ తరుణంలో ప్రజలను చైతన్య పరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అభ్యుదయవాదులు నేటి సమాజానికి ఎంతో అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. డప్పుకళాకారుల నృత్య ప్రదర్శన ఆహుతులను ఆలకింపచేశాయి. జి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ప్రతినిత్యం పనికే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలన్న సంకల్పంతో ఈ మేడే సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. పాత తరం అవుతున్న కనుమరుగదవుతున్న తరుణంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నేటి తరానికి పరిచయం చేయడం సాధ్యమౌతుందన్నారు. 16వ డివిజన్ కళాకారుల కోలాటం ప్రదర్శన ,డప్పుకళాకారుల విన్యాసాలు, పడుగుపాడు రైల్వే గూడ్స్ షెడ్ కార్మికులు 'శ్రమ జీవుల హక్కులకై అశువులు బాసిన అమరులారా ... అందుకోండి అరుణారుణ వందనాలు.. మీ త్యాగ ఫలం.. మీ కర్మ ఫలం వృదా కానీవ్వం ఎర్రనీ జెండా సాక్షిగా ' అంటూ చేసిన నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పి.సూర్యనారాయణ, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, ఎల్ఐసి బాధ్యులు నగేష్, కిన్నెర కుమార్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'ఇంటర్' ప్రవేశానికి దరఖాస్తులు

**ప్రజాశక్తి -కందుకూరు**: టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం 2023-24, సంవత్సరానికి ప్రవేశాలు అప్లికేషన్లు ఇస్తున్నారు. అడ్మిషన్లకు కళాశాల ఆఫీసులో సంప్రదించాలని ప్రిన్సిపల్ కదిరి నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం కళాశాల మొదటి, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమిడీయల క్లాసులు దిగ్విజయంగా జరుగుతున్నాయి.

మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ చదువుతున్న కోలా మధు అను విద్యార్థికి 965 మార్కులు సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చాడని ఆయన తెలిపారు. అదేవిధంగా 900కు పైగా మార్కులు నలుగురు విద్యార్థులు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు.

## జిపిడిపి అవార్డుకు ఎంపికైన 'కొండసముద్రం' పంచాయతీ

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలోని కొండసముద్రం గ్రామ పంచాయతీ 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా (జిపిడిపి) అవార్డుకు ఎంపికైంది. ఈ అవార్డు కింద ప్రభుత్వం రూ. 50 వేలు నిధులను పంచాయతీ ఖాతాకు ప్రోత్సాహంగా జమ చేసింది. ఈ మేరకు ఆ గ్రామ సర్పంచ్ మన్నం వెంగమ్మ శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, అధికారుల సహకారంతో పాటు కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి సూచనల మేరకు పంచాయతిని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకుపోయినట్లు చెప్పారు. అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం, నిర్ధేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో ముందంజలో ఉన్నట్లు వివరించారు. తాగునీరు, పారిశుధ్యం మెరుగుదలకు 15వ ఆర్థికసంఘం నిధులలో 60 శాతం నిధులు వెచ్చించామన్నారు. భవిష్యత్తులోనూ ఆదర్శ పంచాయతిగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆమెవెంట మన్నం వెంకట రమేష్ ఉన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి పంచాయతి విస్తరణాధికారి మాధవి సర్పంచ్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మండలంలోని అన్ని పంచాయతీలు ప్రణాళికాబద్ధంగా పని చేసి, ప్రోత్సాహకం అందుకునేలా కృషి చేయాలని కోరారు.

సర్పంచ్ మన్నం వెంగమ్మ

## ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తు

**ప్రజాశక్తి -కందుకూరు**: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థ (ఐటిఐ) 2023-2024వ సంవత్సరంకు తొలి విడత ప్రవేశాలకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కందుకూరు ఐటిఐ ప్రిన్సిపల్ జెహెచ్ హర్షవర్ధన్ తెలిపారు. ఎస్-ఎస్‌సి, ఆ పై అర్హత కలిగిన అభ్యర్థిని, అభ్యర్థులు అన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా తమ దరఖాస్తులను ఈ నెల 11 నుంచి జూన్ 6వ తేదీ సాయంత్రం 05.00గం.లోగా స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకొని అనంతరం ప్రింట్ తీసుకొని భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా రిజిస్ట్రేషన్ చేసుకోలేని పక్షంలో తేది 11-05-2023 నుంచి 06-06-2023 సాయంత్రం 03.30 గంల వరకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణాసంస్థ (ఐ.టి.ఐ) కందుకూరు నందు రిజిస్ట్రేషన్‌కు సంప్రదించగలరని ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, కౌన్సిలింగ్ తేదీలు త్వరలోనే తెలియజేస్తామన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థ (ఐ.టి.ఐ) కందుకూరును సంప్రదించాలని కోరారు.

## నీటిలో పడి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి -గుడ్లూరు**: ప్రమాదవశాత్తు ఎలుకేరు సత్తా దగ్గర నీటిలో పడి నాగేష్ అనే వ్యక్తి మతి చెందిన సంఘటన గుడ్లూరు మండలం శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన నాగేష్ అనే వ్యక్తి మధ్యాహ్నం సమయంలో ఆదమరిసి నిద్రపోయాడు. నిద్రలో జారీ పక్కనే ఉన్న నిలుకేరు ప్రవాహంలో పడిపోయాడు. దీంతో మతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. నిద్రిస్తున్న వ్యక్తిని ఇంటికి తీసుకుపోయేందుకు వారి బంధువులు సంఘటన స్థలానికి చేరుకోగా అక్కడ లేకపోవడంతో నదిలో వెతుకులాడారు. నీళ్లలో ఉన్న బాధితుడు మతదేహాన్ని వెలికి తీసి పోలీసులకి సమాచారం పంపారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**ప్రజాశక్తి-కందుకూరు**:పట్టణంలోని లక్ష్మీ తిరుమల కళ్యాణ మండపంలో 22వ వార్డుకు చెందిన పేర్నమిట్ట శ్రీనివాసులు పద్మావతి కుమారుడు సచివాలయ ఉద్యోగి మాస్టర్ ట్రైనర్ సాయి కోటేశ్వరరావు, నాగజ్యోతిల వివాహానికి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దంపతులు శుక్రవారం హాజరయ్యారు. శ్రీకాంత్ దంపతులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య దంపతులు, తెలుగుదేశం పార్టీ తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ, పోకూరి రాంబాబు పాల్గొన్నారు.

## జిఒనెం.1రద్దు ప్రజా విజయం

**ప్రజాశక్తి -కందుకూరు**:కేవలం ప్రతిపక్షాలను అణగదొక్కేయటానికి జగన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటిని హైకోర్టు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం వ్యాఖ్యానించారు. ఇది ప్రజా విజయమని, ఇకనైనా జగన్ మోహన్ రెడ్డి బుద్ధి తెచ్చుకొని ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని అన్నారు. జీవో నెంబర్ ఒకటిని హైకోర్టు రద్దు చేసిన సందర్భంగా, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కందుకూరు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి, హైకోర్టు తీర్పు పట్ల హర్షం వ్యక్తం చేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు, గుంటూరు సంఘటనలను సాకుగా చూపి, కేవలం తెలుగుదేశం పార్టీని ఇబ్బంది పెట్టేలా కుట్ర చేసి, బ్రిటిష్ కాలం నాటి జీవో నెంబర్ ఒకటిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. జీవోను రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ సహ ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు నార్నె రోశయ్య, రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, నియోజవర్గ కమిటీ నాయకులు నాదెండ్ల వెంకట సుబ్బారావు పొడపాటి మహేష్, పలువురు నేతలు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-నెల్లూరు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బ్రిటిష్ కాలం నాటి జీఓను తీసుకొచ్చారని, వాక్ స్వేచ్ఛను హరించే, ఆర్టికల్ 19 కు వ్యతిరేకంగా ఉన్న జీవో నెంబర్ వన్ ను ఉన్నత న్యాయస్థానం రద్దు చేయడం హర్షదాయకమని టిడిపి అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్ అన్నారు.శుక్రవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధులు సాబీర్ ఖాన్ కువ్వారపు బాలాజీ లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్ ఖాన్ మాట్లాడుతూ సమాజంలో ప్రజా వ్యతిరేక విధానాలు చేపట్టినప్పుడు, దానికి వ్యతిరేకంగా గళం విప్పే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని, అందుకు తూట్లు పొడుస్తూ వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ వన్ తీసుకొచ్చిందన్నారు. వైసిపి నాయకులు చేస్తున్న అరాచకాలు అక్రమాలు బయటపడతాయి అన్న ఉద్దేశంతో టిడిపి నాయకులను తిరగనివ్వకూడదు, రోడ్ షోలు పెట్టనివ్వకూడదు అన్న కుట్రపూరితమైన చర్యతో తీసుకొచ్చిన జీవోను న్యాయస్థానం కొట్టివేయడం శుభసూచికమన్నారు.

## సర్పంచ్ కుటుంబానికి సిఎం భరోసా

**ప్రజాశక్తి-వలేటివారి పాలెం**: మండలంలోని కలవళ్ల గ్రామ సర్పంచ్ దుగ్గిరాల రాఘవులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతుంది. విషయాన్ని స్థానిక శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి సూచనల మేరకు వైసిపి నాయకులు గణేషం గంగిరెడ్డి ద్వారా సర్పంచ్ భార్య,పిల్లలతో కలిసి శుక్రవారం కావలి పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన సిఎం తక్షణసహాయంగా రూ. లక్ష చెక్కును అందజేశారు. అదేవిధంగా కిడ్నీ బాధితులకు అందించే రూ. పదివేల పింఛన్‌ను వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన సిఎం, ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సిఎం జగన్‌తో మాట్లాడుతున్న దృశ్యం

**ప్రజాశక్తి-కందుకూరు**

వలేటివారిపాలెం మండలం, కలవల్ల గ్రామానికి చెందిన సర్పంచ్ దుగ్గిరాల రాఘవ కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యానికి గురైబాధపడుతున్నాడు. కుటుంబ యజమాని అనా రోగ్యానికి గురవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా చితికి పోయింది. శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి సూచనల మేరకు వైసిపీ రాష్ట్రయువజన నాయకుడు గణేషం గంగిరెడ్డి సర్పంచ్ రాఘవ భార్య చిన్న పిల్లలతో శుక్రవారం కావలి బహిరంగ సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసి వారి పరిస్థితిని వివరించడం జరిగింది. వెంటనే స్పందించిన ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి తక్షణ సాయంగా 1లక్ష రూపాయలు చెక్కు అందజేయడమే కాకుండా, రాఘవకు కిడ్నీ బాధితులకు అందించే పింఛన్ నెలకు 10 వేలు వెంటనే అమలుచేయాలని అధికారులను ఆదేశించారు. తమ కుటుంబానికి అండగా నిలిచి భరోసా కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి స్థానిక శాసన సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డికి రాఘవ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కిమ్స్‌లో అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-నెల్లూరు** :అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవ వేడుకలు నగరంలోని కిమ్స్ వైద్యశాలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మానవత్వం, సేవా గుణాల సమ్మిళితంగా సేవలు అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని ఈ వేడుకలను కిమ్స్ వైద్యశాల నర్సింగ్ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కిమ్స్ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వి.రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ సేవలను, ప్రాముఖ్యతను వివరించారు. ఈ వృతికి ఉన్న గౌరవాన్ని తెలియజేశారు. అనంతరం కిమ్స్ వైద్యశాల కార్డియాలజిస్టు, ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ సిఎస్.శ్రీనివాసరాజు మాట్లాడుతూ వైద్యులు అందించే సేవల కంటే అమ్మలా రోగులను ఆదరించే నర్సుల మానవీయ సేవలే రోగాన్ని సగం నయం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ వైద్యులు ఎన్.జానకిరామ్, జనరల్ ఫిజీషియన్ డిసిఎస్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ కె.బాలకొండయ్య, అనస్థీషియా వైద్యులు ఎస్ .శేషయ్య, వి.జగదీష్, యూరాలజిస్టు సిహెచ్ సురేష్‌కుమార్‌రెడ్డి, నెఫ్రాలజిస్టు బి.మస్తాన్‌వల్లి, గైనకాలజిస్టు టి.జి లక్ష్మీదుర్గ, వైద్యశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరి తదితరులు నర్సింగ్ సేవలను కొనియాడుతూ ప్రసంగించారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

# హెల్పర్ సంధ్యారాణి కుటుంబాన్ని ఆదుకోవాలి

**ప్రజాశక్తి-కందుకూరు**: ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని యానాదిపాలెం అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న నల్లబోతుల సంధ్యారాణి ఆన్ డ్యూటీలోనే ఉండి 11వ తేది హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందింది. చనిపోయిన అంగన్వాడీ హెల్పర్ సంధ్యారాణి కుటుంబాన్ని డిపార్ట్మెంట్‌గా ఆదుకోవాలని, మట్టి ఖర్చులకు రూ.20వేలు తక్షణమే ఇప్పించాలని, ఆమె కుటుంబానికి 5లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆరు నెలలకు ఒకసారి అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రభుత్వమే మెడికల్ చెకప్‌లు చేయించాలని కోరుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం ఐసిడిఎస్ కందుకూరు అర్బన్ ప్రాజెక్టు ఎదుట ధర్నా నిర్వహించారు. సంబంధిత అధికారులైన యుడిసి పద్మజ, సూపర్‌వైజర్ అంజమ్మ లకు అర్జీ ఇవ్వడం జరిగింది.ఈ ధర్నా కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రెహనా బేగం మాట్లాడుతూ అధికారుల పని వత్తిడి కారణంగానే సంధ్యారాణి మరణించింది తప్ప మరో కారణం లేదని పేర్కొన్నారు. ఐసిడిఎస్ అధికారులు బాధ్యత వహించి సంధ్యారాణి కుటుంబాన్ని ఆదుకొనుటకు అన్ని రకాల చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్ మాట్లాడుతూ సంధ్యారాణి డ్యూటీలో ఉండి చనిపోతే ,బాధ్యత ఊహించాల్సిన అర్బన్ సిడిపిఓ ఇప్పటివరకు సంధ్యారాణి కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.వి. శేషమ్మ మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్.కె.సల్మా అధ్యక్షత వహించింది. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్ డి గౌస్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దువ్వూరి. జాన్, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనురాధ తోపాటు కందుకూరు అర్బన్, కందుకూరు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు పాల్గొన్నారు. తొలుత సిఐటియు నాయకులు సంధ్యారాణి భౌతికకాయానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

# 'ప్రకాశం' విద్యార్థులకు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్లు

**ప్రజాశక్తి -కందుకూరు**:విద్యార్థి ఇంటర్నే షిప్, వర్క్ షాపులు, ప్రాజెక్టుల నాలెడ్జి రెజ్యూమ్ (వ్యక్తిగత సమాచారం)ను బలోపేతం చేస్తుందని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన ఇంటర్నే షిప్ ప్రోగ్రామ్‌లో 85 శాతం ప్రకాశం విద్యార్థులు సర్టిఫికెట్‌కు అర్హత సాధించిన సందర్భంగా శుక్రవారం కాలేజీలో జరిగిన విజయోత్సవ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయ్ విద్యార్థుల ప్రగతికి పలు సూచనలు చేశారు. నేర్చుకున్న కోర్సులలో విషయాన్ని పదే పదే పునర్వచనం చేసుకుంటూ ఉండాలని హితవు చెప్పారు. నేర్చుకున్న అంశాల రివిజన్‌ను విస్మరిస్తే భవిష్యత్తు బహత్తర అవకాశాలు గోవిందా అవుతాయని గుర్తించాలని హెచ్చరించారు. ఉన్నత స్థాయి ఉద్యోగం చేస్తున్నా నిత్య విద్యార్థిగా ఉంటే వారి ప్రగతికి బంగారు బాటలు వేసుకున్నట్లేనని విజయ్ ఉద్బోధించారు. వర్క్ షాప్స్,సర్టిఫికేషన్ కోర్సుల కోసం లక్షలాది రూపాయలు యాజమాన్యం హెచ్చిస్తుందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సభాధ్యక్షులు సిహెచ్ రవికుమార్ ఉపదేశించారు. విద్యార్థుల అభ్యున్నతికి ఏది కావాలని ప్రతిపాదించిన నో అనేది యాజమాన్యం నుంచి తన సర్వీస్ లో ఇంతవరకు వినలేదని ఎఆర్‌సి ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి కె. శ్రీకాంత్ విద్యార్థుల హర్ష ద్వానాల మధ్య వెల్లడించారు. అడ్వాన్స్ కోర్సు సర్టిఫికేషన్ ఆన్ ఎమర్జింగ్ టెక్నాలజీలో 80 మంది పైగా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లు సాధించడం అపూర్వ విజయమన్నారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ లాభాల కన్నా దేశ విదేశాల్లో తమ విద్యార్థుల అభ్యున్నతే ప్రకాశం మధుర సంపదగా భావిస్తుదన్నారు. అకడమిక్ విభాగం ప్రతిపాదనలు తమకు వేదంగా భావిస్తామన్నారు. విద్యార్థుల లాబ్‌ల ఆధునీకరణ, పరిశోధనలు, సాంకేతికాభివద్ధికి ఎల్లవేళలా తోడ్పాటు అందిస్తామని అభయమిచ్చారు.విద్యార్థులు వైష్ణవి, సోహిలాల్, మానస, సతీష్‌లు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో తక్కువ కాలేజీలకు లభించిన ఈ కోర్సును తమకు దక్కించిన యాజమాన్యానికి సదా కతజ్ఞతగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగం అధ్యాపకులు కోటేశ్వరరావు, డాక్టర్ రాకేష్, ఎస్.మాధవ్‌లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న కంచర్ల రామయ్య

## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-సీతారామపురం** : మండలంలోని జినిపేరపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డిఎం పవన్‌కుమార్ ప్రారంభించారు. క్వింటాకు రూ.1962 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించిందని పంటలో 14శాతం లోపు తేమ ఉండాలని తెలిపారు. నాణ్యమైన మొక్కజొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి, ఎఇఒ నారాయణ, విఎఎ షరీఫా, రైతులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు సిబిఎస్‌సి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షలకు 79 మంది విద్యార్థులు హాజరు కాగా 79 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. వీరిలో రామ కార్తీక్ 472 మార్కులు, చింతం గోపికృష్ణ 449, గంగినేని రుషికేశ 443 మార్కులు సాధించారు. దీంతో నవోదయ విద్యాలయం తరఫున విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

## వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలంలో ఖాళీగా ఉన్న 8గ్రామ వాలంటీర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మస్తాన్‌ఖాన్ తెలియజేశారు. సంధవరం బిసి ప్రీలు 03, చిలకపాడు ఒసి జనరల్ 01, ఏపిలగుంట బిసి జనరల్ 01, పడమటి నాయుడుపల్లి ఎస్‌సి జనరల్ 01, చినమాచనూరు ఒసి జనరల్ 01, పెగళ్లపాడు ఒసి జనరల్ 01, గ్రామ వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. మే 12 నుండి 15వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 16న పరిశీలన, పరీక్షలు, 17, 18 తేదీల్లో ఎంపికలు జరుగుతాయన్నారు.

## 15వరకు ఈ-కెవైసి గడువు పెంపు

**ప్రజాశక్తి-కావలి** : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తమ ఆధార్‌కార్డు లింక్ అయిన ఫోన్ నెంబరుకు ఈకెవైసి చేయించుకునేందుకు గడువు తేదీని ఈ నెల 15వ తేదీకి పొడిగించినట్టు, ఎవరైనా ఉంటే ఈకెవైసి చేయించుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రమణయ్య ప్రకటనలో కోరారు. కావలి ట్రెజరీ పెన్షనర్ల సౌకర్యార్థం వెంగలరావు నగర్‌లో 100అడుగుల రోడ్డులోని "మహిళాస్ "అపార్ట్‌మెంట్, శ్రీ పొట్టి శ్రీ రాములు మున్సిపల్ హై స్కూల్‌లో శనివారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రెజరీ సిబ్బందితో ఈకెవైసి చేయబడునని తెలిపారు. ఈ 2గంటల్లోనే పెన్షనర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పెన్షనర్లకు తగిన తోడ్పాటు అందిస్తారని వివరించారు. ఆధార్ కార్డుకి ఫోన్ నెంబర్ లింక్ అయినది లేనిది అయితే ఏ నెంబరుకు లింక్ అయినది తెలుసుకోవాలంటే అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రమణయ్య నెంబర్ 9985237349కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ.కె.వై.సి. ఇప్పటికే కూడా చేయించుకొని పెన్షనర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ వైఫల్యాలపై ఫిర్యాదు

**ప్రజాశక్తి-కోవూరు** : కోవూరు నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ వైఫల్యాలపై తహశీల్దార్‌కు బిజెపి నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంద్ర వెంకట రామచంద్ర రావు పాల్గొని మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో కనిగిరి రిజర్వాయర్ అన్ని మండలాలకు కల్పతరువైన రిజర్వాయర్ ఎర్రమట్టి కట్టలను మట్టి తోడుతూ కట్టలు బలహీనపరుస్తూ ఉండడం పెద్ద మాఫియాగా మారిందన్నారు. కోవూరు చెరువు పూర్తిగా ఆక్రమణ గురైంది వల్ల ఈ మధ్య వచ్చిన వరదలతో ఊర్లోని ఇల్లులు కూడా ముంపుకు గురవడం చూశామని తెలిపారు. ప్రధానమంత్రి జలజీవన మిషన్ కార్యక్రమాన్ని దేశమంతా ప్రారంభించి గ్రామాలకు నిధులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నిధులన్ని కూడా వేరే పథకాల వైపు దారి మళ్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కాస శ్రీనివాసులు, ఒబిసి జిల్లా కార్యదర్శి గంజం పెంచలప్రసాద్, కోవూరు అధ్యక్షులు ఐనకోట రఘురామయ్య, విడవలూరు అధ్యక్షులు కనుపర్తి నాగేంద్ర, కొడవలూరు అధ్యక్షులు పగడాల మురళి కృష్ణ, బుచ్చి రూరల్ అధ్యక్షులు గండి రఘురామయ్య, బుచ్చి టౌన్ అధ్యక్షులు రామిసెట్టి మోహన్‌బాబు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

**- కాపాడిన 108 సిబ్బంది**

**ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్** : ఆత్మకూరుకు చెందిన షేక్.సలీమ్ (42) అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఆసుపత్రిలో వెళ్లాలని స్థానిక డాక్టర్లు సూచించడంతో శుక్రవారం నెల్లూరు వైద్యం కోసం నెల్లూరు బస్సులో బయల్దేరారు. వాసిలి దగ్గర వెళ్లగానే సలీంకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో బస్సులోనే పడిపోయాడు. సమాచారం అందుకున్న ఆత్మకూరు 108 సిబ్బంది నిమిషాల వ్యవధిలోని అక్కడికి చేరుకొని అతనికి ప్రథమ చికిత్స అందించి తిరిగి ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. అదే బస్సులో ఉన్న డాక్టర్ హిమబిందు సలీంను ఫిట్స్ వచ్చిన విషయం గమనించి తాళాలు చేతులో పెట్టి ఆయనకు ధైర్యం చెప్పారు. భయపడకుండా ఉండాలని సూచించారు. 108కి దగ్గరుండి పంపించారు. సకాలంలో ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందికి డాక్టర్ హిమబింధువుకు సలీం కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మరోసారి రెచ్చిపోయిన దొంగలు

**ప్రజాశక్తి-మర్రిపాడు** : మండలం డిసిపల్లిలో వరుస చోరీలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇటీవల మూడు దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. గురువారం రాత్రి ఇంటి యజమాని కత్తి దొరసానమ్మ ఇంట్లో లేని సమయంలో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఐదు సవర్ల బంగారు, రూ.30వేలు నగదు ఎత్తుకెళ్లి మరోసారి రెచ్చిపోయారు. బాధిత మహిళ తమ బంధువుల వివాహానికి వెళ్లి రాత్రికి అక్కడే ఉండి శుక్రవారం ఉదయం ఇంటికి చేరుకొని ఇంట్లో చూడగా దుస్తులు, ఇతర వస్తువులు చెల్లా చెదరుగా పడివున్నాయి. చోరీ జరిగిందని తెలిసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్య రంగంలో నర్సుల పాత్ర గొప్పది..

**ప్రజాశక్తి-నెల్లూరు** : వైద్య రంగంలో నర్సుల పాత్ర ఉన్నతమైనదని, రోగుల పట్ల అమ్మ లాంటి వారి ఆదరణ ఎవరూ మరువలేనిది అని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేదాయపాలెంలోని శ్రీదుర్గ ఎడ్యుకేషనల్ సొసైటీలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం పి.ఎం.పి. అసోసియేషన్, రూడ్స్ చారిటబులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత్వం, సేవా గుణాల సమ్మిళితంగా సేవలు అందించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకోవటం గర్వకారణమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ మాట్లాడుతూ నాడు ఫ్లోరెన్స్ నైటింగేల్ అందించిన సేవలకు మించిన సేవలను కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రపంచ వ్యాప్తంగా నర్సులు అందించారని, వారి సేవలను ప్రపంచం గుర్తు పెట్టుకుందన్నారు. పి.ఎం.పి. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ వైద్యులు అందించే సేవల కంటే అమ్మలా రోగులను ఆదరించే నర్సుల మానవీయ సేవలే రోగాన్ని సగం నయం చేస్తాయని పేర్కొన్నారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ మాట్లాడుతూ మాతదేవతకు ప్రతిరూపమైన నర్సులు సేవలకు కోవిడ్ సమయంలో ప్రపంచమంతా మొక్కిందని, వారిని గౌరవించుకోవటం ప్రతి ఒక్కరి విధి అని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలు అందిస్తున్న సీనియర్ నర్స్ ఉమా మహేశ్వరిని సత్కరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నర్సింగ్ విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రిన్సిపల్ దుర్గ రెడ్డి, కరస్పాండెంట్ ప్రదీప్, వినోదిని, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం

**ప్రజాశక్తి-వెంకటాచలం** : చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం, అనికేపల్లి గ్రామంలో శుక్రవారం రూ.2.70 కోట్లతో నిర్మించిన సిసి రోడ్లను, రూ.2.30 కోట్లతో నిర్మించిన సైడు డ్రెయిన్లను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధిలు, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# కాజ్ వే పనులను ప్రారంభించాలి

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట**

ముదివర్తిపాలెం – మధువర్తి మధ్య కాజ్ వే పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తుళ్లూరి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇందుకూరుపేట మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న తుళ్లూరు గోపాల్ మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో భాగమైన ఇందుకూరు పేట మండలం నియోజకవర్గానికి దూరంగా ఉన్నదని నియోజకవర్గానికి అనుసంధానం చేయడానికి కాజ్‌వే ఒక్కటే పరిష్కారం మార్గమని తెలిపారు. ఇందుకూరుపేట మండలం మరో కోనసీమగా ప్రసిద్ధి గాంచిందని కానీ నేడు ఉప్పునీటితో వ్యవసాయ రంగానికి ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఇప్పటికే తాగునీరిని ప్రజలు కొనుక్కొని తాగాల్సి వస్తుందని ఈ సమస్య పరిష్కారానికి కాజ్‌వే ఒకటే పరిష్కారం మార్గమని పేర్కొన్నారు. ముదువర్తిపాలెం – ముదివర్తి మధ్య కాజ్‌వే నిర్మాణం రాజకీయ గ్రహణం పట్టినదని పాలకుల చిత్తశుద్ధి లేకపోవడం వల్ల కాజ్‌వే నిర్మాణం జాప్యం జరుగుతుందన్నారు. ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పనులను వెంటనే ప్రారంభించేందుకు కృషి చేయాలని లేని పక్షంలో కోవూరు నియోజక వర్గ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టివివి ప్రసాద్, జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మారుబోయిన రాజా, సిపిఎం మండల నాయకులు శ్యామ్‌రెడ్డి, కోటేశ్వరరావు, సిద్ధవరపు ప్రభాకర్ రెడ్డి, కోనేటి వెంకయ్య, శేషయ్య, వెన్ను వేణు, చానిబాషా, మనోహర్, వాసు, వెంకయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తుళ్లూరి గోపాల్

# వికలాంగులకు సిఎం ఆర్థికసాయం

**ప్రజాశక్తి-కావలి**

కావలి పర్యటనకు శుక్రవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వికలాంగులను ఆప్యాయంగా పలకరిస్తూ కలిసేందుకు ఎదురు చూస్తున్న వికలాంగులను ప్రత్యేకంగా హెలిప్యాడ్ ప్రాంగణంలోకి పిలిపించుకుని, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆదుకుని వికలాంగులు ముఖ్యమంత్రికి తమ ఆవేదన వెలిబుచ్చుకున్నారు. వీరి సమస్యలను ఆలకించిన ముఖ్యమంత్రి తక్షణసాయంగా లక్ష రూపాయలు అందించి, అవసరమైన వైద్య సేవలు సత్వరమే అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆదుకుని వికలాంగులకు మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఆర్డీఓ శీనా నాయక్ సమక్షంలో తక్షణ సాయంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. కలెక్టర్ హరి నారాయణన్ ప్రత్యేకంగా వికలాంగుల వద్దకు వెళ్లి వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తానే స్వయంగా నమోదు చేసుకుని, ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## ఉదయగిరిలో అభివృద్ధి శూన్యం

**- ఎంపిటిసి ఆగ్రహం**

**ప్రజాశక్తి-ఉదయగిరి**

పాలకులు మారిన ఉదయగిరి అభివృద్ధి శూన్యంగా ఉందని ఎంపిటిసి కాకు విజయ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పువ్వులపల్లి సుందరయ్య భవనంలో ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయగిరి బిజ్జంపల్లి ఘాట్ రోడ్డును పూర్తి చేయాలని, అన్నంపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పసుపు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలు కనీస మౌలిక సదుపాయాలు లేక అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకు వెంకయ్య, సిపిఎం నాయకులు పందిళ్ల వెంకటేశ్వర్లు, పెంచలయ్య ఎస్ఎఫ్ఐ నాయకులు కృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి కాకు విజయ

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

ఆత్మకూరు ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థులు తమ కాలేజ్ ప్రాజెక్టు రిపోర్ట్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానం తెలుసుకొనేందుకు కరటం పాడు గ్రామంలోని రైతు భరోసా కేంద్ర పరిధిలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న భూములను పరిశీలించారు. గ్రామంలోని నరసింహారావు అనే రైతు నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని విద్యార్థులు సందర్శించి ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా 30 రకాల విత్తనాలు పచ్చరొట్టు ఎరువుగా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానం వల్ల ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని తనకున్న 20 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారానే పంటల పండిస్తున్నానని రైతు నరసింహారావు తెలిపారు. ఆరోగ్యకరమైన పంటలు పట్టించే ఆర్గానిక్ వ్యవసాయ విధానాన్ని ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు తమ కాలేజ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లో రాసుకున్నారు. క్షేత్ర ప్రదర్శన అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ అధికారులు బీజామృతం విత్తన శుద్ధి రసాయనాన్ని తయారుచేసి చూపించారు. విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుబ్బమ్మ, సుబ్బరాయుడు, కాశీ వీరనారాయణ, నాగరాజు, దొరసానమ్మ, రైతు భరోసా కేంద్రంకు చెందిన యస్దాని, శ్రావణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## జనావాసాల్లోకి జింక

**ప్రజాశక్తి-సంగం** : అటవీ ప్రాంతం నుంచి కొరిమెర్ల గ్రామంలోకి ఓ జింక వచ్చింది. గమనించిన గ్రామస్తులు జింకను సురక్షితంగా గ్రామంలోని రామాలయంలో ఉంచారు. అప్పటికే కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను ఆలయ పూజారి పసుపు పూసి గాయమైన ప్రాంతంలో కట్టుకట్టారు. అనంతరం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు జింకను వైద్య చికిత్స కోసం తరలించారు. జింకను చూసేందుకు గ్రామస్తులు భారీగా తరలివచ్చారు.

## కళాకారులకు ప్రశంసా పత్రాలు

**ప్రజాశక్తి-ఇందుకూరుపేట** : మేడే సాంస్కృతికోత్సవంలో భాగంగా నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన భవన్లో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక మేళాలో పాల్గొన్న కళాకారులకు ప్రశంసాపత్రాలు అంద జేశారు. తన పాటలతో అలరించిన ఆటో కార్మికులు గోపాల్‌కు, కర్ర సాములో అత్యంత ప్రతిభ కనపరిచి వీక్షకులను అలరించిన ఆటో యూనియన్ నాయకులు దగ్గు మనోహర్ కుమారుడు యగ్నేష్‌కు జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం చైర్మన్ చంద్రా గోపాల్ చేత ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సిఐటియు అధ్యక్షులు టివివి ప్రసాద్, ఆటో కార్మిక సంఘం నాయకులు మారుబోయిన రాజా, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.కె.షాన్‌భాషా, తదితరులు పాల్గొన్నారు.

# విపక్ష నాయకుల ముందస్తు అరెస్టులు

**ప్రజాశక్తి-కావలి**

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందస్తు అరెస్టులు చేసి 2వ పట్టణ, 1వ పట్టణ, కావలి రూరల్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, పసుపులేటి పెంచలనరసింహం, అళిపతపు కన్సర్ కరవది భాస్కర్, టిడిపి పట్టణ కార్యదర్శి జ్యోతి బాబూరావు, బిజెపి నేతలు బ్రహ్మానందం, మండ కిరణ్ ఉన్నారు.

# బొల్లినేని కలిసిన ఎంఎల్ఎ మేకపాటి

**ప్రజాశక్తి-కలిగిరి**

ఉదయగిరి అభివృద్ధి కోసమే సస్పెండ్ అయిన తర్వాత ఇండిపెండెంట్ ఎంఎల్ఎగా, మాజీ ఎంఎల్ఎ బొల్లినేని మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉదయగిరి మెట్ట ప్రాంతమని అభివృద్ధి చెందాలంటే అధికారంలోకి రాబోయే పార్టీతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఉదయగిరిలో టూరిజం, రోడ్లు, సాగునీరు తదితర సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు. అనంతరం బొల్లినేని రామారావు తమ కార్యకర్తలను పరిచయం చేస్తూ వీరంతా బాధితులేనని మేకపాటికి తెలుపుతూ ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించాలని కోరారు. అనంతరం బొల్లినేని మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి జగన్మోహన్ రెడ్డికి చాలా తేడా ఉందని కక్షపూర్వకంగానే ఇన్‌ఛార్జిల పేరుతో శేఖర్‌రెడ్డిని ఇబ్బంది పెట్టడం బాధాకరమన్నారు. గతంలో రాజకీయంగా సవాళు ప్రతి సవాళ్లు ఇద్దరం చేసుకొనే విషయం వాస్తవమేనని అవి రాజకీయంగా ఉండాలే తప్ప కక్ష పూరితంగా ఉండకూడదన్నారు. జిల్లాలో ముగ్గురు వైసిపి ఎంఎల్ఏలు జగన్‌ను నమ్మినందుకు నట్టేట ముంచారని బొల్లినేని విమర్శించారు. జిల్లా అధిష్టానం ఆదేశాల మేరకే మేకపాటితో కలిసి పనిచేయడం జరిగిందన్నారు. కేడర్ సహకరిస్తే 2024లో ఉదయగిరిలో పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. పార్టీ పరంగా అన్యాయం జరిగిన మేకపాటి కూడా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఒంటేరు జయ చంద్రారెడ్డి, కార్యదర్శి కాకు మహేష్, నాయకులు సిహెచ్, తాతయ్య, ఎస్.కొండయ్య, వెంగప నాయుడు, పి.సుబ్బారావు, కర్నాటి.ప్రభాకర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బొల్లినేని రామారావు

# నవరత్నాల ఇళ్లకు జియో ట్యాగింగ్

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామం జగనన్న నవరత్నాలు సంబంధమైన 121 ఇల్లు మంజూరు కాగా శుక్రవారం షెడ్యూల్డ్ తెగలకు చెందిన 9 మందికి వర్క్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నాయబ్ రసూల్ జియో ట్యాగింగ్ చేశారు. అనంతరం వర్క్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కాలనీల్లో అధునాతన సౌకర్యాలు వస్తాయని, జగనన్న కాలనీల్లో ఒకే రకమైన నమూనాతో ప్రతి ఇంటిని 340 చదరపు అడుగుల పరిధిలో నిర్మాణం చేసుకోవాలని సొంతగా కట్టుకునే స్థోమత లేనివారికి ప్రభుత్వమే ఇళ్లు నిర్మింస్తుందన్నారు. సొంత స్థలాలు ఉండి, ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులకు నిర్మాణ సామగ్రి కొనుగోలు, కూలీల ఖర్చు కింద ప్రభుత్వం తన వాటా భరిస్తుందని ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.లక్షా 80 వేలు అందిస్తుందని తెలిపారు. అర్హులు ఎవరైనా లబ్ధిదారుల జాబితాలో లేకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తారని ఇళ్ల నిర్మాణం వల్ల కూలీలకు పెద్ద సంఖ్యలో పని దినాలు ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాగంటి శ్రీనివాసులు (సిద్దయ్య), గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు, వాలంటీర్లు, ఇంటి పట్టా లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సిఎంతో చేజర్ల కలయికపై ఆశలు

**ప్రజాశక్తి-ఉదయగిరి**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపిపి చేజర్ల సుబ్బారెడ్డి కలకపై నియోజకవర్గ వైసిపి కార్యకర్తల్లో నూతన ఆశలు రేకెత్తించాయి. శుక్రవారం కావలి పర్యటన సందర్భంగా చేజర్ల సుబ్బారెడ్డి మర్యాదపూర్వకం ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నియోజకవర్గం సంబంధించిన అనేక సమస్యలు సిఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన త్వరలో పరిష్కరిస్తా మని హామీనిచ్చారు. గత కొద్దిరోజులుగా నియోజక వర్గానికి సరైన నాయకత్వం లేకపోవడంతో కార్యకర్తలు స్థబ్దుగా ఉండడం గమనార్హం. దాంతో సిఎంను చేజర్ల కలవడంతో ఒక్కసారిగా వైసిపి కార్యకర్తల్లో నూతనోత్సా హం ఆశలు రేకెత్తిస్తున్నాయి. రానున్న రోజుల్లో చేజర్లకే ఇన్‌ఛార్జి కట్టబెట్టే అవకాశం ఉందని కార్యకర్తలు నాయకులు సంతోషం వ్యక్తపరిచారు.

## జొన్నవాడలో బ్రహ్మోత్సవాలు

**ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం**

జొన్నవాడ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. స్వామి అమ్మవార్లకు శుక్రవారం తిరుచా ఉత్సవం శాస్త్రక్తంగా ఆలయ అర్చకులు నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లను పట్టు వస్త్రాలు స్వర్ణభరణాలతో అలంకరించి పల్లకిలో స్వామి అమ్మవార్ల విగ్రహమూర్తులను కొలువు తీర్చి తిరుచా ఉత్సవం నిర్వహించారు. తిరుచా ఉత్సవంలో స్వామి అమ్మవార్లు పల్లకిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థాన చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు దేవస్థానం ఈవో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులపై సర్వసభ్య సమావేశంలో అన్ని విభాగాల ఉద్యోగులతో ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపిపి మూలే పద్మజ వినయ్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సమావేశంలో వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశంలో పలు అభివృద్ధికి పనులపై ఆయాశాఖల అధికారులతో సమీక్షించారు. చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం బండగానిపల్లి పంచాయతీ ఎంపిటిసి కాకు విజయ సమస్యలు వినాలంటూ బైఠాయించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డిఇ నరసింహ, జిల్లా కోఆప్షన్ సభ్యులు గాజుల తాజుద్దీన్, ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి, ఎంపిటిసిలు గొల్లపల్లి తిరుపతయ్య, సుభహాన్, మండల కోఆప్షన్ సభ్యులు సుభాని, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

## భోజన ప్యాకెట్లు వితరణ

**ప్రజాశక్తి-కావలి**

కావలి పట్టణం నివాసులు రాణాప్రతాప్ – వసంత దంపతుల కుమార్తె చిన్నారి వినూత్న చార్విరెడ్డి 10వ పుట్టిన రోజు సందర్భంగా సంయుక్త సేవాసంస్థ అధ్యక్షుడు సురేంద్ర ద్వారా కావలి పట్టణం శివరామ సుబ్బయ్య కాలనీలోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నేటి దాతలు వారి కుమార్తె పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు పోయి వృథా ఖర్చులు చేయకుండా పేదలకు ఒక్క పూటైనా ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా సంయుక్త సేవాసంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చిన దాతలు ఎస్.రాణాప్రతాప్ – వసంతకు ధన్యవాదాలు తెలుపుతూ ఉన్నామని తెలిపారు. పుట్టినరోజు జరుపుకుంటున్న చిన్నారి వినూత్న చార్విరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'పది' విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

**ప్రజాశక్తి-మర్రిపాడు**

మండలం లోని చుంచులూరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 500 మార్కులపైన సాధించి, ప్రతిభ చూపిన విద్యార్థులను పూర్వ విద్యార్థి, ప్రవాస భారతీయుడు చింతంరెడ్డి సుదర్శన్‌రెడ్డి ఘనంగా సత్కరించి, రూ.7500 ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. విద్య ద్వారా ప్రతిఒక్కరూ ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ కృషి చేయాల న్నారు. హెచ్ఎం రమేష్, చింతంరెడ్డి సిద్దారెడ్డి, జయమ్మ, డాక్టర్ స్వాతి, కలిశెట్టి రాజేంద్ర కుమార్, దువ్వూరు సురేష్ కుమార్, తంగేడుపల్లి సుబ్బయ్య, వనం విఠల్ కుమార్, వాసుదేవ్, విద్యార్థులు నవ్యశ్రీ, ఆకాష్, చంద్రిక, ఖాజామొహిద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత అవసరం

**ప్రజాశక్తి-వరికుంటపాడు**

మండలంలోని జంగంరెడ్డిపల్లిలో జరిగిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో సిహెచ్ఒ రాజశేఖర్ మాట్లాడుతూ గృహ పరిసరాలు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని ఆయన సూచించారు. గృహ పరిసరాలలో మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సుశీలమ్మ, ఎఎన్ఎం, ఆశా కార్యాకర్త, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సేవామూర్తులకు సన్మానం

**ప్రజాశక్తి-ఉదయగిరి**

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తున్న ఆరోగ్య సేవమూర్తులకు మండల కోఆప్షన్ షేక్ సుభాని, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ పలువురు నర్సులకు ఘన సన్మానం చేశారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నర్సుల దినోత్సవం వేడుకలను వైద్యులు ఠాగూర్ సమక్షంలో సీనియర్ నర్సులు నిర్మల, విజయలను శాలువా, మెమొంటో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే గండిపాలెం పి.హెచ్.సి. పరిధిలోని అప్పసముద్రం ఎఎన్ఎం పద్మ దాసరపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆమెను ఘన సన్మానం చేసి కేక్‌ను కట్ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులపై వారు చేసిన సేవలను కొనియాడి మెమొంటాలతో అందజేసి శాలవాలు పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నాసర్, సిహెచ్ఒ సురేష్, ఎంపిహెచ్ఎ మేల్ మన్సూర్ అంగన్‌వాడీ టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానం

**ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్**

విద్యార్థులు పుస్తక పఠనాన్ని దినచర్యగా అలవాటు చేసుకోవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని ఆత్మకూరు లైబ్రరీ ఇన్‌ఛార్జి శ్రీనివాసరాజు అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులతో పుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, క్యారంబోర్డు లాంటివి ఆడిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసిక వికాసానికి ఎదుగుదలకు తోడ్పాటు ఇస్తారని తల్లిదండ్రులు విద్యార్థులను సమ్మర్ క్యాంపునకు పంపించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమ్మర్ క్యాంపు 5వ తేదీ నుండి జూన్ 11వరకు 35 రోజులు పాటు విద్యార్థులకు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ ఎల్.తనూజ విద్యార్థులు పాల్గొన్నారు.

### వేసవి శిబిరంలో ఆట పాటలతో విద్య

**ప్రజాశక్తి-కొడవలూరు** : వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు ఆట పాటలతో కూడిన విద్యనందిస్తున్నట్లు కొడవలూరు గ్రంథాలయ లైబ్రేరియన్ కే.రాజేశ్వరి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు దేశంలోని ప్రముఖుల గురించి తెలియజేయడంతోపాటు నీతి కథలు చదివించడం, రాయించడం చేస్తారన్నారు. విరామ సమయంలో కబడ్డీ, కేరమ్స్, స్కిప్పింగ్ ఆటలు ఆడిస్తామని తెలిపారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండ బారిన పడకుండా గ్రంథాలయాలకు రావడం వల్ల సరదా కబుర్లు, కథలు, వింత సంఘటనలు, ఆట పాటలతో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు పిల్లలను గ్రంథాలయాలకు పంపాలన్నారు.

## రాయితీపై విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి-కొడవలూరు**

యాభై శాతం రాయితీతో పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఒ సిహెచ్.లక్ష్మి కోరారు. మండలంలోని గండవరం ఆర్‌బికెలో రైతులకు రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను శుక్రవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి పంట పూర్తయినందున పచ్చి రొట్ట విత్తనాలను సాగు చేసుకోవడం ద్వారా నేలకు సత్తువ చేకూరుతుందన్నారు. మంచి దిగుబడులు సాధించాలంటే వచ్చి రొట్ట విత్తనాల సాగు తప్పనిసరని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అన్నీ ఆర్‌బికెలలో యాభై శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగలు కిలో రూ.79 లు కాగా, రాయితీపై రూ.39.50లకు, పిల్లిపెసర కిలో రూ.97లు కాగా, రాయితీపై 48.50 లకు, జనుము కిలో రూ.84లు కాగా రూ.42లకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. విఎఎ టి.కవిత, రైతులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనుల పరిశీలన

**ప్రజాశక్తి-ఉదయగిరి**

మనబడి నాడు నేడు పేస్- 2 పనులను ఎంఇఒ షేక్ మస్తాన్ వలి పరిశీలించారు. శుక్రవారం స్థానిక ఎంపిపిఎస్ దళితవాడ పాఠశాలలో జరుగుతున్న మనబడి నాడు-నేడు పేస్2 పనులను ఆయన పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణం కోసం జెసిబితో తవ్వుతున్న పిల్లర్లను బేస్మెంట్ గుంతలను పరిశీలించారు. తరగతి గదులలో నిర్మాణంలో ఉన్న ఫ్లోరింగ్ నిర్మాణంలో ఉన్న ప్రహరీ గోడ ఎత్తును పరిశీలించి ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ప్రభుత్వ సూచనల ప్రకారం ప్రతి పనిని నాణ్యత గల వస్తువులను వాడుతూ నాణ్యతతో కూడిన పనులు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌టి హుస్సేనీ, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**మూడవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు : నెల్లూరు**

**I.A.No. 34/2021**
**O.S.No.77/2019**

1. **శ్రీ పాముల తిరుమల** మరియు ఇతరులు ... పిటీషనర్/ వాదులు

Vs

4. **ప్లాటినం ప్రాజెక్ట్స్ తరపున మేనేజింగ్ పార్ట్నర్ తులసి చంద్రశేఖర్,** తండ్రి బ్రహ్మయగుప్త, నివాసము : ప్లాట్ నెంబర్. 4A, S. V. Q The Nest, D. No. 27-1-198, బాలాజీ నగర్, నెల్లూరు సిటీ. ... రెస్పాండెంట్లు / ప్రతివాదులు

**దావా నోటీసు**

పాముల తిరుమల వగైరాలు ఆస్తి భాగ పంపకములకై పై కోర్టులో వేసిన పై నంబరు దావా O.S.No.77/2019 లో 2వ వాది పాముల సుబ్రహ్మణ్యం చనిపోయినందున దాఖలు పరచిన వారసుల పిటిషను I. A. No. 34/2021, ప్లాటినం ప్రాజెక్ట్స్ వారికి నోటీసు నిమిత్తము **తే 16.06.2023 ది** వాయిదా వేసి ఉన్నారు.కావున ఆ దినము **ఉదయం 10.30 గంటలకు** నాలుగవ రెస్పాండెంట్ అయినా ప్లాటినం ప్రాజెక్ట్స్ వారు స్వయంగా గాని, ప్లీడర్ ద్వారా కానీ హాజరై సంజాయిషీ చెప్పుకోని యెడల మీ పరోక్షములో తీర్మానించబడునని తెలియజేయడమైనది.
నెల్లూరు.

**తేది: 12.05.2023**

**ఆర్. సత్యనారాయణ**
పిటిషనర్ల తరపు న్యాయవాది